కమ్యూనిటీ భవనాలకు మోక్షం ఎప్పుడో?


అసంపూర్తిగా ఉన్న ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణం


నిలిచిన బీసీ (నాయీ బ్రాహ్మణ) కమ్యూనిటీ భవనం


పశువుల మలమూత్రాలతో నిండిన ఎస్సీ కమ్యూనిటీ హాల్


ఎస్సీ కమ్యూనిటీ హాలు శంకుస్థాపన శిలా ఫలకం

- ఎన్నికల సమయంలో నిలిచిన నిర్మాణాలు
- నేటికీ పట్టించుకోని పాలకులు

పెనుమంట్ర: మండల కేంద్రమైన పెనుమంట్ర రాజీవ్ కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఎస్సీ బీసీ కమ్యూనిటీ భవనాలను పూర్తి చేయాలని ఆయా వర్గాల ప్రజలు కోరుతున్నారు. ఈ కాలనీలో రూ.15 లక్షలతో ఎస్సీ కమిటీ హాల్, రూ.10 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి 2024 ఫిబ్రవరిలో నాటి మంత్రి చెరుకువాడ శ్రీ రంగనాథరాజు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లా పరిషత్ నిధులు మంజూరు చేశారు. రెండు భవనాలు శ్లాబు లెవెల్ వరకు పనులు పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడంతో భవన నిర్మాణ పనులను మధ్యలోనే నిలిచిపోయాయి. నేడు అధికారులు లేదా కూటమి ప్రభుత్వం పట్టించు కోకపోవడంతో పశువులు, కుక్కలు, గొర్రెలు మేకలకు ఆ భవనాలు ఆవాసంగా మారాయి. ఆ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి కమ్యూనిటీ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇదిలా ఉండగా గత టీడీపీ హయాంలో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు 2019 ఫిబ్రవరి 16న నాటి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ రూ.50 లక్షలు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయించారు. నాటి మంత్రి నక్కా ఆనందబాబు సమక్షంలో పితాని శంకుస్థాపన చేశారు. అయితే వెంటనే పనులు ప్రారంభించకపోవడంతో ఆ శంకుస్థాపన శిలాఫలకంగానే నిలిచిపోయింది. గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అయినా కూటమి ప్రభుత్వం ఈ నిర్మాణాలను పూర్తిచేసి బడుగు బలహీన వర్గాల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇళ్ల మధ్య డంపింగ్ యార్డ్ వద్దు


సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దృశ్యం

నరసాపురం: తమ ఇళ్ల మధ్య డంపింగ్‌యార్డ్ పెడితే సమించేది లేదని పట్టణంలోని 28వ వార్డు దళితులు హెచ్చరించారు. 28వ వార్డులో ఉన్న మున్సిపాలిటీ స్థలంలో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం వార్డు ప్రజలు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. తమ బాధను ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్‌కు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. స్థానికులు చదలవాడ జ్ఞానప్రకాష్ మాట్లాడుతూ దళితులు, పేదలు ఉన్న ప్రాంతంలో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయడం తగదన్నారు. ఇళ్ల మధ్య డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేస్తే ప్రజలు రోగాల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్డీఓ దాసి రాజు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. చిద్రపు మురళీధర్, కొల్లాబత్తుల చిట్టియ్య, చదలవాడ మెర్లిన్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 42 అర్జీలు


ప్రజా సమస్యలు వింటున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాని డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి మొత్తం 42 అర్జీలు అందినట్టు ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. దరఖాస్తులకు సంబంధించి సమస్యల పరిష్కారం విషయంలో చురుగ్గా వ్యవహరించాలని అధికారులను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనధికార గరికట్లు తొలగించండి

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలో అనధికారికంగా దర్భరేవు డ్రెయిన్, వెస్ట్‌కుక్కిలేరు, మోడిపర్ర, శేషావతారం పంటకాలువ, దర్భరేవు డ్రెయిన్లలో ఏర్పాటు చేసిన గరికట్లను వెంటనే తొలగించాలని కోరుతూ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎల్బీచర్ల గ్రామానికి చెందిన శ్రీవెంకటేశ్వర మెరైన్ మత్స్య సహకార సంఘం అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు ఆశీష్‌కుమార్, తిరుమలశెట్టి వెంకటేశ్వరరావులు ఫిర్యాదు చేశారు. ఈ కాలువలపై ఉన్న అనధికార గరికట్లను తొలగించి తమ మత్స్య సహకార సంఘానికి ఆదాయం వచ్చే విధంగా తగు సూచనలు ఇస్తూ సంబంధిత అధికారులను ఆదేశించాలని పేర్కొన్నారు.

కులవృత్తికి ఇబ్బంది కలిగిస్తే.. పోరాటం తప్పదు

ఆచంట వేమవరం రజకుల హెచ్చరిక


ఆచంట వేమవరంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పితాని

పెనుగొండ: ఎన్నో తరాలుగా కులవృత్తిపైనే ఆధారపడుతున్న రజకుల కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి. ఆచంట వేమవరంలో రజకులు ఎన్నో తరాలుగా కులవృత్తి చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు సేకరించిన దస్తులు శుభ్రపరచి సుమారు ఎకరం స్థలానికి పైగా ఉన్న భాగంలో ఆరబెట్టుకొంటుంటారు. అయితే, ఇటీవల మంత్రి అనగాని సత్యప్రసాద్ గ్రామంలో పర్యటించినపుడు విద్యుత్ సమస్యలను గ్రామస్థులు ప్రస్తావించి, సబ్ స్టేషన్ నిర్మించాలని కోరారు. రూ.3.20 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రజకుల స్థలంపై స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి పడడంతో విద్యుత్ సబ్ స్టేషన్‌కు రజకులు వినియోగిస్తున్న స్థలాన్ని కేటాయించడానికి సన్నాహాలు ప్రారంభించారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను కలిసి కులవృత్తికి ఆటంకం కల్పించవద్దంటూ రజకులు ఇటీవల విన్నవించుకొన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆచంట వేమరం పర్యటించి స్థలాన్ని పరిశీలించారు. మహిళలు అందరూ ఎమ్మెల్యేను కలిసి కులవృత్తికి ఆటంకం కల్పించవద్దంటే వేడుకొన్నారు. అభివృద్ధికి ఆటంకం కల్పించవద్దంటూ ఎమ్మెల్యే పితాని హెచ్చరిచండంతో ఢీలా పడిపోయారు. స్థలం సర్వే చేసి కులవృత్తికి ఆటంకం లేని విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. కులవృత్తికి ఆటంక కలిగితే ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతాయని రజకులు ఆవేదన వ్యక్తం చేశారు. కులవృత్తికి ఇబ్బంది కలిగితే పోరాటం చేస్తామని రజకులు హెచ్చరించారు. దీంతో రజకులు వినియోగించుకొనే స్థలం సమస్యాత్మకంగా మారింది.

విశ్వేశ్వరయ్యకు నివాళి


పాఠశాలలో మోక్షగుండంకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు


కాపు క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్‌కు సన్మానం

నరసాపురం రూరల్: దేశ ప్రగతిలో భాగస్వాములైన మహనీయుల జీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఉపాధ్యాయురాలు ఉప్పుగంటి రాజశ్రీ సూచించారు. సోమవారం మొక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని జాతీయ ఇంజినీర్స్‌డే సందర్భంగా నరసాపురం మండలం కొప్పర్రు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లకు సన్మానం

పాలకొల్లు సెంట్రల్: ఇంజినీర్స్ డే సందర్భంగా పట్టణంలో పలు సేవా సంస్థల ఆధ్వర్యంలో ఇంజనీర్లకు సన్మానం చేశారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఎం కన్వెన్షన్ నందు యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్లు ఎంవి శర్మ, పోలిశెట్టి పెద్దిరాజు, నల్లమోతు ప్రసాద్‌లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గుండుమోగుల వీరాస్వామి, కొండ్రెడ్డి సూరిబాబు, మద్దాల వాసు, మద్దాల రాంప్రసాద్, కఠారి నాగేంద్ర, పోకల రాము, వేరుకొండ దుర్గాప్రసాద్, గండం ఏసుపాదం, సంగిసీడి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథి డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శిడగం సతీష్, సెక్రటరీ దోనెల ప్రసాద్, ట్రెజరర్ దేవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనారోగ్యబాధితులకు ఆర్థిక సహకారం అందించారు. పోడూరు గ్రామానికి చెందిన కిడ్నీల సమస్యతో బాధపడుతున్న కె.సుబ్బలక్ష్మి, వెన్నెముకకు తీవ్ర గాయమై లేవలేని స్థితిలో ఉన్న కె.నాగసిద్దయ్యలకు వసుధ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంతెన వెంకట్రామరాజు రూ.10 వేలు, రూ.15 వేలు చొప్పున ఏర్పాటుచేసిన ఆర్థిక సాయాన్ని ఫౌండేషన్ కన్వీనర్ బుద్దరాజు బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు చేకూరి సూరిబాబు, చెరుకూరి సత్యనారాయణరాజు, బుద్దరాజు వెంకటేశ్వరరాజు, బీఎస్ఎన్ఎల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


భీమవరం క్రైమ్ పోలీస్ స్టేషన్ వద్ద ఈగల్‌సెల్ ఆధ్వర్యంలో ర్యాలీ దృశ్యం

భీమవరం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీమవరం క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐ డి రాంబాబు అన్నారు. ఈగల్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో క్రైమ్ పోలీస్ స్టేషన్ వద్ద సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనుకోని రీతిలో సైబర్ నేరానికి గురైతే కంగారు పడకుండా వెంటనే 1930 ఫోన్ నెంబర్‌కు, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సీహెచ్ మహేష్ మాట్లాడుతూ ప్రజల బలహీనతలే సైబర్ నేరస్థుల బలంగా మారిందని, సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ఉండటానికి అప్రమత్తతతే ప్రధాన ఆయుధమన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్‌సెల్ కానిస్టేబుల్ మురళీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలి


ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహారాజును కలిసిన కిషోర్

కాళ్ల: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, పార్టీ ప్రతిష్ట పెంచాలని ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ పీవీఎల్ నరసింహారాజు కోరారు. వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమింపబడిన యార్లపాటి కిషోర్ ఉండి నియోజకవర్గ ఇంచార్జ్ పీవీఎల్ నరసింహారాజును మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉండేవారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎర్లపాటి కిషోర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సిద్ధాపురం గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

భీమవరం: పట్టణంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఇస్లామిక్ ట్రస్ట్ సేవాకార్యక్రమాల్లో భాగంగా సోమవరం పట్టణంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ముహమ్మద్ సిద్దీఖ్ మాట్లాడుతూ అందరి దేవుడు ఒక్కడే, మానవులంతా ఒక్కటేనని సాటి మనుషుల పట్ల సత్ప్రవర్తన, అవసరార్థుల పట్ల జాలి, కరుణ, దయ, కుల మతాలకు అతీతంగా మానవసేవ ముహమ్మద్ ప్రధాన సందేశమన్నారు.

అంగన్‌వాడీ, డ్వాక్రా భవనాల చుట్టూ దుర్గంధం


అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పేరుకుపోయిన చెత్తాచెదారం


ఐసీడీఎస్ కార్యాలయం, డ్వాక్రా భవనాల వద్ద నెలకొన్న దుస్థితి

పెనుమంట్ర: మార్టేరు – పెంటపాడు స్టేట్ హైవే రోడ్డు పక్కనే పెనుమంట్ర రాజీవ్ కాలనీలో నిర్మించిన స్త్రీ శిశు సంక్షేమం (ఐసీడీఎస్) కార్యాలయం, అంగన్‌వాడీ స్కూల్, డ్వాక్రా భవనాల చుట్టూ దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. ఈ భవనాల చుట్టూ ప్రహరీ లేకపోవడం, స్థానిక అధికారులు పర్యవేక్షణ కొరవడంతో కొందరు స్థానికులు చెత్తాచెదారాన్ని డంప్‌చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం వర్షం వస్తే దుర్గంధంగా మారుతుంది. అసలే పల్లప్రాంతం ఉన్న ఈ ప్రాంతంలోని భవనాలు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. స్టేట్ హైవే రోడ్డు పక్కనే మలమూత్ర విసర్జన చేస్తున్నా అధికారుల పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం లోపం కారణంగా డ్వాక్రా భవనం నిరుపయోగం మారింది. భవనాలు చుట్టూ ప్రహరీ నిర్మించాలని, పారిశుద్ధ్యం చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

17న ఆకివీడు సీహెచ్‌సీలో ప్రత్యేక క్యాంపు

ఆకివీడు: ఈ నెల 17వ తేదీన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు వైద్యాధికారి సీహెచ్. ఆదిలక్ష్మి సోమవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు జేస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం ప్రత్యేక శిబిరాల్ని ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించి, నిపుణులతో వైద్య సేవలందిస్తారని చెప్పారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఉప సభాపతి, జిల్లా వైద్యాధికారులు పాల్గొంటారని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

మోషేనురాజును కలిసిన చిట్టిబాబు

భీమవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ విభాగం సంయుక్త కార్యదర్శిగా నూతనంగా నియమితుడైన మామిడిశెట్టి చిట్టిబాబు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజును మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం భీమవరంలోని మోషేనురాజు క్యాంపు కార్యాలయంలో చిట్టిబాబు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు వీరా మల్లికార్జునుడు తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య సేవలు

ఉండి: మండలంలో హెల్పింగ్ హ్యాండ్స్ సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో భీమవరానికి చెందిన మ్యాక్సీవిజన్ కంటి ఆసుపత్రి, ఇంపీరియల్ ఆసుపత్రులకు చెందిన వైద్యులు, సిబ్బంది పాల్గొని రోగులకు ఉచితవైద్య సేవలు అందజేశారు.

క్లుప్తంగా

క్షీరారామలింగేశ్వరస్వామికి పూజలు


సప్తసోమవార ప్రదక్షిణ ప్రారంభ పూజలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ప్రదోషకాలంలో భక్తులు సప్తసోమవార ప్రదక్షిణల్లో పాల్గొన్నారు. ప్రదక్షిణలు అనంతరం స్వామివారికి పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

7వ రోజుకు రిలే దీక్ష


దీక్షలో పాల్గొన్న ట్రక్కు ఆటో కమిటీ సభ్యులు

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం వెంప – మొగల్తూరు రోడ్డును తక్షణం నిర్మించాలని ట్రక్కు ఆటో యూనియన్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి రోజుకు చేరింది. దీక్షలో ట్రక్కు ఆటో సభ్యులు జవదుల ఆనందరావు, పొన్నపల్లి భాస్కరరావు, అడ్డాల రవి, పాలా శ్రీను, చల్లా సత్య, అడ్డాల రవినారాయణ, పడవల మణిబాబు, పొన్నపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు


వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ చంద్రశేఖరరెడ్డి

యలమంచిలి: రైతులంతా తమ పశువులకు గాలి కుంటు వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేయించాలని మండల పశు వైద్యాధికారి పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి సూచించారు. ఈ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం యలమంచిలిలో ఆయన ప్రారంభించారు. 52 మంది రైతులకు చెందిన 48 ఆవులు, 168 గేదెలకు వ్యాక్సిన్ వేశారు. దొడ్డిపట్ల గ్రామంలో మంగళవారం వ్యాక్సిన్ వేస్తామని ఆయన వివరించారు.

సీహెచ్‌సీ వైద్యాధికారిగా రాంబాబు


డాక్టర్ రాంబాబు

పెనుగొండ: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.రాంబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పాలకొల్లు ఏరియా ఆసుపత్రి నుంచి పెనుగొండ సీహెచ్‌సీకి బదిలీపై వచ్చారు. ప్రభుత్వ వైద్య సేవలు రోగులకు సక్రమంగా అందేలా కృషి చేస్తానని తెలిపారు. డాక్టర్ రాంబాబుకు సీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఇంకా కొనసాగుతున్న హైడ్రామా

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి నియామకం, ఎంపిక విషయంలో ఇంకా హైడ్రామా కొనసాగుతుంది. వీసీ కుర్చీ ఖాళీగా ఉందా. ఇప్పటి వరకు ఉన్న వీసీగా ఉన్న వ్యక్తి కార్యాలయానికి వచ్చి వ్యవహారాలు సాగిస్తున్నారా అనే విషయాన్ని వీసీ తర్వాత బాధ్యతాయత ఉద్యోగంలో ఉన్న రిజిస్ట్రార్ గుంభనంగా ఉంచుతున్నారు. మీడియా ఫోన్ చేస్తే చాలా సందర్భాల్లో స్పందన కరువే. దీంతో ఉద్యాన వర్సిటీలో ఏం జరుగుతుందో బయట ప్రపంచానికి బాధ్యుల ద్వారా తెలియడం లేదు. ఆగస్టు 31 వరకు తాత్కాలిక వీసీగా పనిచేసిన కె.గోపాల్ సూపర్ రెన్యూయేషన్ పద్ధతిలో తన వయస్సు 65 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు వీసీగా కొనసాగించాలని హైకోర్టులో రిట్‌పిటిషన్ వేశారు. ప్రతివాదులుగా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ టు వ్యవసాయ, సహకారశాఖ, ఉద్యానవర్సిటీ రిజిస్ట్రార్‌ను చేర్చారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 226 ఆధారంగా తన పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకోవాలని పిటిషనర్ కోరారు. ఇంటీరియమ్ ఆదేశాలు పిటిషనర్‌కు అనుకూలంగా ఉన్నట్టుగా పిటిషనర్ భావించడంతో , తన ఉద్యోగ కాలం పెరిగినట్టుగా అనుకున్నట్టు సమాచారం. ఈ రిట్ పిటిషన్ విషయంలో ప్రభుత్వం తరపు న్యాయవాదులు సూపర్ రెన్యూయేషన్ ఉద్యానవర్సిటీ వీసీ విషయంలో వర్తించదని, రాజ్యాంగంలోని 14,16 అధికరణలకు విరుద్ధమని వాదించారు. అంతే కాకుండా వయస్సు పెంపునకు సంబంధించి 2023లో దాఖలైన రెండు రిట్ పిటిషన్ల గురించి ఉదాహరించారు. కోర్టు రీకాల్ ఇచ్చింది. దీంతో ఉద్యానవర్సిటీ వీసీ పరిస్థితి కోర్టు రీకాల్ , మంత్రి పేషీలో ఫైల్ అన్నట్టుగా ఉంది.